చిత్రాలలో కొంతలో కొంత ఉండేది. అనేక న్యూథియేటర్స్ చిత్రాలూ, ప్రభాత్ చిత్రాలూ ప్రజలకు కొంత కళాభిరుచినీ, సంస్కృతినీ అందించాయి. కాని యుద్ధానంతరం చిత్రనిర్మాణంలో అటువంటి వైఖరే మృగ్యమైపోయింది. ఇది సినిమా పరిశ్రమపురోభివృద్ధికి పెద్ద ఆటంకం.

* * *

ప్రకాశ్ ప్రొడక్షన్స్‌వారు ఈసారి తయారు చేస్తున్న చిత్రంలో మూడు హాస్యచిత్రాలుంటాయి. అన్నిటిలోనూ బాలానంద సంఘ సభ్యు లుంటారు. కథలుకూడా బాలానంద సంఘంవారి ప్రదర్శనలే. అందులో మొదటిది "బూరెల మూకుడు" అనే హాస్య నాటిక. ప్రదర్శింపు జరుగుతోంది. న్యాయపతి రాఘవరావు, కామేశ్వరమ్మగార్లు నిత్యమూ సెట్ మీద ఉండి నిర్వహణ చేస్తున్నారు. పిల్లలు ఈ నాటికలను అనేక పర్యాయాలువేసి బాగా తయారయి ఉన్నారు గనక ఎక్కువ రిహార్సల్సు అవసరం లేదు. సినిమాకోసం ప్రకాశరావుగారు మార్పులేమీ చెయ్యటంలేదు, ట్రీట్‌మెంటు కూడా ఏమీలేదు. ఉన్న నాటకాలను స్టేజి మీదలాగే ఆడించి కట్ షాట్స్‌తో తయారు చేస్తున్నారు. ఇందువల్ల పని చాలా తేలిక అవుతున్నది. దేశంలోగల పిల్లలకి ఈ నాటకాలు చాలా ఆకర్షవంతంగా ఉండగలవనటానికి సందేహం లేదు.

---

టుమ్రీ

# లేత బుర్ర

"శ్రీ విరించి"

సీతాపతి నిద్రపోతున్నాడు. బడికెదిగిన కొడుకు పలకా పుస్తకాలు ముందువేసుకున్నా పక్కనే కూచున్న చెల్లాయి "కుక్కబొమ్మ"మీదే దృష్టి నిలిపాడు. వాడా ఆనందాన్ని పూర్తిగా అనుభవించక ముందే సీత యిట్లొంచి యివతలిగదిలోకి వచ్చింది. రెండునిమిషాలు ఓపికపట్టి చూచింది. కొడుకు ధ్యాస మళ్ళించేట్టులేదు. "చదువుకోరా నాయనా! ఎట్లా బాగుపడుతావురా చదువుకోకపోతేనూ?"అన్నది. అంటూనే కూతుర్ని యెత్తుకుని యింట్లోకెళ్ళిపోయింది.

సీతాపతి నిద్రపోతూనేవున్నాడు. కొడుకు మాత్రం మళ్ళీ పుస్తకంమీదికి ధ్యాస మళ్ళించాడు గాని తల్లి అన్నమాట వాడికి అర్థంకాక ఆలోచనలోపడ్డాడు. "చదువుకోకపోతే బాగుపడటం యెల్లాగురా" అన్నదావిడ. ఈ బాగుపడటం అంటే యేమిటో వాడికర్థంకాదు. ఆవిడ నోటిమీదిగా ఇదేమాట రోజూ అనేకసార్లు వింటూంటాడు కాని దీనికి అర్థం తెలియదు. తను యెప్పుడన్నా అల్లరిలాంటిది చేస్తున్నట్టు తోస్తే తల్లి"బాగుపడేలక్షణాలు"అంటుంది. ఆ మాటలో వ్యంగ్యం కుర్రవాడికి అర్థంకాదు. కాని అసలు సంగతీ తెలీదు కనక ప్రమాదంలేదు."బాగు"అనే మాటకి అర్థంకోసం వాడి లేత మనస్సు తపనపడిపోతూన్నది. ఏదేనా వస్తువుని చూచినప్పుడు అనే "బాగున్నది"అనేమాట - మనుషులమీదా మనుషుల చర్యలమీదా ప్రయోగిస్తే మరి వాడి కర్థంకాదు. వాడికెటూ అర్థం కాదుగదా అని ఆ తల్లి అనటమూ మానెయ్యదు. ఆ మాటకి అర్థం తల్లినే అడిగితే యేం మూడునో అని కుర్రవాడికి భయం. పోతే తండ్రిని అడుగుదామంటే సీతాపతి యెప్పుడూ ఇంట్లో నిద్రపోతూనే వుంటాడు, నిద్రపోని సమయాల్లో ఇంట వుండడు. ఇంటి సంగతులు యేదీ అతనికి పట్టనట్టు దూరదూరంగా వుంటాడు. దేన్నిగురించీ సీతాపతి 'రిమార్కు' చెయ్యటం యీ కొడుకు యెరగడు. కుర్రవాడి ఆలోచనలకి హద్దుండదు. అసలు వాడు యేమీ ఆలోచించకుండా, చదువుకున్నంతసేపూ పాఠాలేవో చదువుకుని మిగతా కాలంలో ఓమూల కూచుందామని యెప్పుడూ నిశ్చయించుకుంటూనే వుంటాడు. కాని తీరా పుస్తకాల ముందు కూచున్నవాడికి యిదే ఆలోచన తగుల్తుంది. "బాగుపడటం అంటే యేమిటి?" అని. వాడి ఆలోచన తెగదు. కాలం నడిచిపోతూనే వుంటుంది. సీతాపతి నిద్రపోతూనే ఉంటాడు.